క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో పట్టణంలో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పైపులైన్ మరమ్మతులు పూర్తయిన వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మంత్రి సమీక్ష


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అధికారులు

పార్వతీపురం: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖామంత్రి ఎన్.రామానాయుడు మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారీ నీటి పారుదల పథకాలు, మైనర్ ఇరిగేషన్, జలాశయాలు, తదితర అంశాలపై చర్చించారు. సాగునీటి వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు తదితరులున్నారు.

రాయితీపై టమాటా

పార్వతీపురం: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రైతు బజారుల్లో రాయితీ ధరకు టమాటాను సరఫరా చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలో టమాట రూ.50లకు విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఒక కుటుంబానికి ఒక కిలో చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన వారు ఆధార్‌కార్డు లేదా రేషన్ కార్డు కాపీని కౌంటర్‌లో చూపించి టమాటాను కొనుగోలు చేయవచ్చన్నారు.

నిరుపేదకు సాయం


బాధితునికి సాయం చేస్తున్న జనసైనికులు

బలిజిపేట: మండలంలోని తుమరాడ గ్రామానికి చెందిన నండ సూరప్పడకు అదే గ్రామానికి చెందిన జనసైనికులు రూ.2వేలు ఆర్థిక సాయం, 25కిలోల బియ్యం బస్తాను మంగళవారం అందజేశారు. సూరప్పడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన జనసైనికులు అతనికి సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ఎస్.తాతబాబు, ఎం.సురేష్, పి.జయరాం, బి.సాయిమోహన్, వై.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాద్

సాలూరు: పాచిపెంట మండలంలో పి.కోనవలస వద్ద ఉన్న అటవీశాఖ, వ్యవసాయశాఖ చెక్‌పోస్టులను విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. పలు అంశాలపై సిబ్బంది వద్ద ఆరాతీశారు. చిత్తశుద్ధితో పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

బలిజిపేట: మద్యం, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్సై సింహాచలం కోరారు. బర్లి గ్రామంలో మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ నంబరు, ఓటీపీ, తదితర వివరాలు ఎవరికీ చెప్పకూడదని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

మద్యం షాపుల కోసం 123 దరఖాస్తులు

సీతానగరం: సీతానగరం ఎక్సైజ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల నుంచి మద్యం షాపుల నిర్వహణ కోసం మంగళవారం సాయంత్రానికి 123 దరఖాస్తులు వచ్చాయని సీఐ డి.పద్మావతి తెలిపారు. గరుగుబిల్లి మండలం నుంచి 57, సీతానగరం మండలం నుంచి 33, బలిజిపేట మండలం నుంచి 33 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. బుధవారంతో దరఖాస్తు స్వీకరణ గడువు ముగుస్తుందని, ఆసక్తి ఉన్నవారు సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బ్యాంకులకు దీటుగా పోస్టల్ సేవలు

- ప్రజలకు మరింత చేరవయ్యేందుకు వినూత్న కార్యక్రమాలు
- మొబైల్ యాప్‌ల ద్వారా ఆర్థిక కార్యకలాపాలు
- నేడు ప్రపంచ తపాలా దినోత్సవం



పార్వతీపురంటౌన్: ఆధునిక సాంకేతిక విప్లవంతో తపాలాశాఖ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో తపాలాశాఖ ఆధునికతను అందిపుచ్చుకొని వినూత్న ఆలోచనలతో సరికొత్త సేవలు అందించేందుకు ముందడుగు వేసింది. ఒకప్పుడు లెటర్లు, మని ఆర్డర్లు చేరవేసే పోస్టల్ శాఖ నేడు బ్యాంకింగ్, సరుకు రవాణా, ఈ-కామర్స్, డోర్ డెలివరీ వంటి సేవలతో పాటు అనేక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఖాతాదారులకు అందించడంలో ముందుంటోంది. ఆర్థిక సేవలు అందించే విషయంలో బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలకు పోస్టల్‌శాఖ గట్టిపోటీ ఇస్తోంది. నేడు ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

పోస్టల్ సేవలు ఇలా..

ప్రైవేట్ సంస్థలు, బ్యాంకులకు దీటుగా పోస్టాఫీస్ శాఖలో కూడా ఆన్‌లైన్ సేవలు, ఏటీఎంలు అందుబాటులోకి వచ్చాయి. మొబైల్‌మనీ ట్రాన్స్‌ఫర్, ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్, మై స్టాంప్ పథకం, స్పీడ్ పోస్టుల సేవలు, ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. స్పీడ్ పోస్ట్, వ్యక్తిగతంగా మన ఫొటోలతో విడుదల చేసే మై స్టాంప్, రికరింగ్ డిపాజిట్లు, మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, సేవింగ్స్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, స్టాంపుల కలెక్షన్, సుకన్య సమృద్ధి యోజన, ఇన్సూరెన్స్ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

జిల్లాలో పోస్ట్ ఆఫీస్‌ల వివరాలు..

పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)ను పోస్టల్ శాఖ ప్రారంభించింది. పార్వతీపురం డివిజన్ పరిధిలో పార్వతీపురం, బొబ్బిలి కలిపి 2 ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో 38 సబ్ పోస్టాఫీస్‌లు, 395 బ్రాంచ్‌లు ఉన్నాయి. కొత్తగా 10 బ్రాంచ్‌లు పెరిగాయి. ఇందులో 828 మంది ఉద్యోగులు ప్రతి రోజూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

ఘనంగా వారోత్సవాలు

ప్రపంచ తపాలా దినోత్సవం నేటి నుంచి వారం రోజుల పాటు పార్వతీపురం డివిజన్‌లో ఉన్న అన్ని తపాలా కార్యాలయాల్లో ఘనంగా వారోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 10న 4 ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ గ్రామంలో పోస్టల్ సేవలు అందిస్తున్నాం. మారుమూల పల్లెలకు పోస్టల్ సేవలు అందించేందుకు బయోమెట్రిక్ విధానాన్ని తీసుకువెళ్లి గ్రామస్తులకు ఆర్థిక లావాదేవీల సేవలు అందిస్తున్నాం.

– బాబూరావు, పోస్టల్ సూపరింటెండెంట్, పార్వతీపురం డివిజన్

గ్రామాల్లో బయోమెట్రిక్ ద్వారా నగదు

గ్రామాల్లో ఉన్న పోస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ మిషన్ అందించారు. దీని ద్వారా బ్యాంకుల్లో అకౌంట్ ఉండి ఐపీపీబీలో అకౌంట్ ఉంటే బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న నగదును మనం కావాలని పోస్టల్ సిబ్బందికి ఫోన్ చేసి చెబితే బయోమెట్రిక్ తీసుకొని రూ.5 నుంచి రూ.10 వేల వరకు నగదు అందిస్తారు. ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు ఈ పథకం చాలా ఉపయోగపడుతోంది.

'డయల్ యువర్ డీఎం'కు 11 వినతులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం డిపో మేనేజర్ ఈఎస్‌కే దుర్గ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 11 మంది ఫోన్‌చేసి వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. మధ్యాహ్న సమయంలో విశాఖపట్నం వెళ్లే బస్సులు పార్వతీపురం పాత బస్టాండ్ మీదుగా వెళ్లేలా చూడాలని, అదేవిధంగా రాత్రి 10 గంటల తరువాత విశాఖపట్నం నుంచి వచ్చే బస్సులు పాతబస్టాండ్ వరకు వెళ్లేలా చూడాలని పలువురు ప్రయాణికులు కోరారు. కార్తీక మాసంలో పంచ శైవ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడపాలని, సమయానికి గమ్య స్థానాలకు చేరుకునేలా సర్వీసులు నడపాలని మరికొందరు కోరారు. పార్వతీపురం నుంచి వెలగవలస గ్రామానికి సంగంవలస మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. అలాగే పార్వతీపురం బస్‌స్టేషన్ అవుట్‌గేట్, ఇన్‌గేట్ వద్ద లైటింగ్ మెరుగుపరచాలని పలువురు కోరినట్లు డీఎం చెప్పారు. తాడికొండకు అదనపు సర్వీసులు నడపాలని, పెద్దబుడ్డిడి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, అజ్జాడ గ్రామానికి నైట్‌హౌట్ సర్వీసు వేయాలని వినతులు వచ్చినట్లు చెప్పారు. ప్రయాణికుల సూచనలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలి


మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ శశిభూషణరావు

సీతానగరం: ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనపై దృష్టిసారించాలని కోర్సు డైరెక్టర్లు శశిభూషణరావు, మనోహర్, పీటర్, శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం కొనసాగింది. పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లదే కీలకపాత్ర అన్నారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మంచినీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించాలని సూచించారు.

పేదల బియ్యం.. పెద్దల భోజ్యం

- రెచ్చిపోతున్న రేషన్ మాఫియా
- పట్టించుకోని అధికారులు


గొల్లవానివలసలో అక్రమంగా నిల్వచేసిన బియ్యం(ఫైల్)

పార్వతీపురం: పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నెలనెలా ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేస్తోంది. పేదలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో రేషన్ దుకాణాలు, ఎండీఎం వాహనాల ద్వారా బియ్యాన్ని అందజేస్తున్నారు. రేషన్ దుకాణాల నుంచి తెచ్చుకున్న బియ్యానికి ఎంతో కొంత ముట్టజెప్పి స్థానిక వ్యాపారులు సేకరిస్తున్నారు. వారి వద్ద నుంచి బడా వ్యాపారులకు బియ్యాన్ని రాత్రిపూట ఆటోలు, వ్యాన్ల ద్వారా మిల్లులకు తరలించి వాటికి పాలీష్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ తతంగం అంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నప్పటికీ అడపాదడపా దాడులను నిర్వహించి మమ అనిపించేస్తున్నారు. గరుగుబిల్లి మండలంలోని రేషన్ మాఫియా పెచ్చుమీరుతోంది. సెప్టెంబర్ 14న ఉల్లిభద్రలోని కోల్‌ఫారంలో 6,500 కిలోల బియ్యం, అక్టోబర్ 7న గొల్లవానివలస పరిసరాల్లోని గొడౌన్‌లో 24వేల కిలోల బియ్యంను అధికారులు పట్టుకున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో మహ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి బియ్యాన్ని నిల్వ చేయడం గమనార్హం. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడులు చేసి సీతానగరం మండలం కాశీపేట సమీపంలో అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న 154 బస్తాలు బియ్యంను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేశారు. బియ్యం తరలింపుపై పూర్తిస్థాయిలో నిఘా లేకపోవడంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. పీడీఎస్ బియ్యాన్ని పక్కతోవ పట్టిస్తున్నారు. రేషన్ కార్డుదారుల నుంచి మధ్య వ్యాపారులు కిలో రూ.10ల నుంచి రూ.15లకు కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.20లకు విక్రయిస్తున్నారు. ఆ బియ్యాన్ని బడా వ్యాపారులు రీసైక్లింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో రేషన్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బియ్యం అక్రమ రవాణాలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


పార్వతీపురం టౌన్: సంగంవలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్

సీతానగరం: వరిపంటను ఆశ్రయించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. మండలంలోని గాదెలవలస, దయానిధిపురం గ్రామాల్లో మంగళవారం 'పొలం బడి' కార్యక్రమం నిర్వహించారు. వరిలో దోమపోటు, పొడతెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఏఓ రైతులకు వివరించారు. దోమపోటు నివారణకు ఎసీఫేట్ మందు లేదా ట్రైఫ్లిమ్‌మిజోఫైరిమ్ 1/2 కేజీ వంతున 240 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పొడతెగులు నివారణకు 1/2 కేజీ హెక్సాకొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని హెక్టారుకు 250 ట్యాంక్‌లు చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం దయానిధిపురంలో వ్యవసాయ సహాయకులతో కలిసి పొలంబడి నిర్వహించారు.

సంగంవలసలో..

పార్వతీపురంటౌన్: మండలంలోని సంగంవలస గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధి, అంతర పంటలు, కంచె పంటలు, ఆకర్షక పంటలు, కలుపు నివారణ, రైతు సేవా కేంద్రాల్లో అందించే సేవలు, ఎరువుల వినియోగం, వ్యవసాయంలో యాంత్రీకరణ, ప్రభుత్వం అందించే రాయితీలు, తదితర అంశాలపై ఏఓ అశోక్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజన్నదొర పరామర్శ


నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణానికి చెందిన వ్యాపారవేత్త నెక్కంటి శ్రీను తల్లి మంగళవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వారి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్రీనుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజన్నదొర వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పంట నష్టం పరిశీలన

మక్కువ: మండలంలోని నంద గ్రామానికి చెందిన పలువురు గిరిజన రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట నష్టపోవడంతో మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంటసాగు విస్తీర్ణం, నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న పంట నష్టపోవడానికి గల కారణాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మరోమారు పరిశీలించి, నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మధుసూదనరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రవంతి, ఏఓ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో పర్యావరణానికి మేలు

సాలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాల భవిష్యత్ ఆరోగ్యకరంగా ఉంటుందని జేడీఏ డాక్టర్ రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సువ్వాడ గణేష్‌కు చెందిన పామాయిల్ తోటలో ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తున్న అంతర పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అన్నంరాజువలస పంచాయితీలో అరటి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి షణ్ముఖరాజ్, ఎన్ఎఫ్ఏ శారద, ఏడీఏ మధుసూదనరావు, ఏఓ అనురాధ పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో పోలమాంబ



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారు మంగళవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ వి.వి సూర్యనారాయణ ఆధ్వర్యంలో చదురుగుడి వద్ద వేదపండితులు కె.శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి పూజలు చేశారు. గ్రామానికి చెందిన వడగల్ల వేణు అమ్మవారి పాదల వద్ద పుస్తకాలు, పెన్నులు ఉంచి పూజలు చేసి వాటిని చిన్నారులకు అందజేశారు.

ఎండీఎం వర్కర్లపై రాజకీయ వేధింపులు అన్యాయం



మాట్లాడుతున్న ఎండీఎం వర్కర్ల జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి

పార్వతీపురంటౌన్: రాజకీయ వేధింపులతో వర్కర్ల తొలగింపులు ఆపాలని ఎండీఎం వర్కర్ల జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో మధ్యాహ్న భోజన కార్మికులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20లకు పెంచాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. ఎండీఎం వర్కర్ల జిల్లా అధ్యక్షులు తులసి, లక్ష్మి, ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మిగా దుర్గమ్మ


బలిజిపేట: అజ్జాడలో లక్ష్మీదేవి అవతారంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు


సాలూరు: దీపాలంకరణలో దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి


పార్వతీపురం: ఎం.ఆర్.నగరంలో లక్ష్మీదేవిగా పూజలందుకుంటున్న దుర్గాదేవి

పార్వతీపురంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొత్తవలస వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం శ్రీమహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే వైకేఎం వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

లక్ష్మీదేవీగా..

బలిజిపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అజ్జాడలో విజయదుర్గ భవానీ ఆలయంలో మంగళవారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. బలిజిపేటలో ఆటో యూనియన్ వర్కర్స్ ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 3 వేల మందికి అన్నసమారాధన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దీపాల అలంకరణలో..

సాలూరు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో దీపాలంకరణ చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

పార్వతీపురం: మండలంలోని ఎం.ఆర్.నగరంలో వెలసిన కోటదుర్గమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని సంగంవలస, వెంకంపేట, అడ్డాపుశీల తదితర గ్రామాలలో దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన


పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఓ సతీష్‌కుమార్

సీతానగరం: ఖరీఫ్ పంటలకు సంబంధించి పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సహాయ గణాంక అధికారి సతీష్‌కుమార్ అన్నారు. దయానిధిపురం, జయంతిరాయపురం రైతుసేవా కేంద్రంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయకులకు పంటకోత ప్రయోగాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ మాట్లాడుతూ.. వరి పంట దిగుబడి ఆధారంగానే ధరల స్థిరీకరణ, ఆహార ధాన్యాల కేటాయింపులు ఉంటాయన్నారు. మండలంలో వరి సాగు విస్తీర్ణం ఆధారంగా 32 యూనిట్లుగా విభజించడం జరిగిందన్నారు. ఇందులో 128 పంటకోత ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పంటకోత ప్రయోగాలు చేపట్టేందుకు వీలుగా వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి


కె.ఎస్.పురంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వ్యర్థాలను డంపింగ్ యార్డులకు లేదా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని కోట సీతారాంపురం గ్రామంలో సర్పంచ్ ఉడమల విజయలక్ష్మి, కార్యదర్శి కామేశ్వరరావు ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు ఎక్కువగా ఉన్నందున దోమల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే గ్రామాల్లో లక్షలాది రూపాయిల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మానవహారంగా ఏర్పడిన సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: తమిళనాడులోని శామ్‌సంగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు నాలుగు వారాలుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య భవనం ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కంపెనీలో పనిచేస్తున్న 2వేల మంది కార్మికులలో 1450 మంది సీఐటీయూ సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. కార్మికుల సమస్యలను కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న శామ్‌సంగ్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శాంతికుమారి, బి.సూరిబాబు, లక్ష్మి, తులసి, పావని, డ్రైవర్ అమ్మ, మంగమ్మ, పార్వతీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

పేదల పొట్ట కొట్టొద్దు


ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలను ప్రేరేపిస్తోందని, పేదల పొట్ట కొట్టేందుకు చూస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు ఆరోపించారు. మండలంలోని చెల్లింపేటలో పార్టీ సీనియర్ నాయకుడు పి.పారినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి మతతత్వ రాజకీయాలను రెచ్చగొట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, విజయవాడ వరదలు, విభజన చట్టం హామీలు, సూపర్‌సిక్స్ పథకాలు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల వంటి సమస్యలపై దృష్టి సారించకుండా చంద్రబాబు పేదల పొట్ట కొడుతుంటే బీజేపీ, జనసేన నాయకులు భజనలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి విధానాలను మానుకోవాలని హితవు పలికారు. శివరాంపురం, చెల్లింపేటలలో మంచినీరు, సాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై దృష్టిసారించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో మన్మథరావు, కె.జ్యోతి విశ్వేశ్వరరావు, లక్ష్మణ్‌నాయుడు, ఆర్.నాయుడు, సత్యనారాయణ, అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.